మహిళాభ్యున్నతితోనే సమాజ శ్రేయస్సు


భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్‌ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: మహిళా అభ్యున్నతితోనే సమాజ శ్రేయస్సు ఆధారపడి ఉందని, మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని వనస్థలిపురం డివిజన్‌ కార్పొరేటర్‌ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌ అన్నారు. వనస్థలిపురం డివిజన్‌ పరిధిలోని జనప్రియ హోమ్స్‌ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.12లక్షలతో సీనియర్‌ సిటిజెన్స్‌ భవనంపై నూతనంగా నిర్మించిన శ్రీవైష్ణవి జనప్రియ మహిళా మండలి కమ్యూనిటీహాల్‌ను శుక్రవారం వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా మండలి అధ్యక్షురాలు జ్యోతి సాయి మాట్లాడుతూ..ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో భవనాన్ని నిర్మించుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు పీవీఎస్‌.రావు, వేములయ్యగౌడ్‌, మహిళా మండలి ప్రతినిధులు రాజేశ్వరి, రమ, పద్మావతి, మమత, భాగ్యలక్ష్మి, శశికళ, విజయలక్ష్మి, విజయకుమారి, దేవకి పాల్గొన్నారు.

డీఐ రామిరెడ్డిని సస్పెండ్‌ చేయాలి

మన్సూరాబాద్‌: దళిత మహిళపై థర్డ్‌ డిగ్రీ ప్రయోగించిన అధికారిని విధుల నుంచి తొలగించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం శేఖర్‌ డిమాండ్‌ చేశారు. దళిత మహిళపై దాడికి నిరసనగా బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి ప్రవీణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని డా.బీఆర్‌.అంబేడ్కర్‌, బాబూ జగ్జీవన్‌రామ్‌ విగ్రహాల వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత మహిళను వివస్త్రను చేసి భర్త ఎదుట థర్డ్‌ డిగ్రీ ప్రయోగించిన డీఐ (డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌) రామిరెడ్డిని వెంటనే విధుల నుంచి తొలగించాలన్నారు. ఇంత దారుణం జరిగిన ప్రభుత్వం, ఎమ్మెల్యేలు, ప్రజా సంఘాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. దారుణానికి పాల్పడిన పోలీసులపై క్రిమినల్‌ కేసులు నమోదు చేసి బాధితురాలికి రూ.25 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఈ నిరసనలో గుండెల ధర్మేందర్‌, రామచంద్రం, గ్యార జగన్‌, దయాకరన్‌, పల్లాటి రాములు, మాసూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌బీనగర్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు

గిరిజనులు ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్‌: గిరిజనులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని రంగారెడ్డి జిల్లా గిరిజన సంఘం ఉపాధ్యక్షులు గోపీనాయక్‌, జగన్‌నాయక్‌ అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌ బంజారా కాలనీలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. గిరిజన తెగలు ఆగస్టు 9న ప్రపంచ గిరిజన హక్కుల దినంగా జరుపుకోవాలని 1994లో ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసిందని గుర్తు చేశారు. ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌లో ఉండే ఇళ్లులేని లంబాడీ గిరిజనులకు డబుల్‌ బెడ్రూమ్‌లు, రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మగంత నాయక్‌, ముత్యాలీ, నవీన్‌ నాయక్‌, సైది బాయి, శ్రీను నాయక్‌, లక్ష్మి బాయి, జ్యోతి, మిలాల్‌, సిద్ధు నాయక్‌ పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి

హస్తినాపురం: ఎల్‌బీనగర్‌ నియోజకవర్గం పరిధిలోని చాలా ప్రాంతాలలో వీధి కుక్కలు రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. నాగార్జున సాగర్‌ రహదారితో పాటు చుట్టూ పరిసర ప్రాంతాలలో తిష్టవేసి రాకపోకలు సాగిస్తున్న క్రమంలో వెంబడించి గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బారినుంచి తమను కాపాడాలని కాలనీలు, బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


టీచర్స్‌కాలనీలో సంచరిస్తున్న వీధి కుక్కలు

ముదిరాజ్‌ జాతి ప్రయోజనాలే లక్ష్యం

కాచిగూడ: రాష్ట్రంలో సుమారు 60 లక్షల మందితో అత్యధిక జనాభా కలిగి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన ముదిరాజ్‌ జాతి ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుదామని ముదిరాజ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ బొర్ర జ్ఞానేశ్వర్‌ ముదిరాజ్‌ స్పష్టం చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లో తెలంగాణ మన ముదిరాజ్‌ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ చొప్పరి శంకర్‌ ముదిరాజ్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాలలో ముదిరాజ్‌ సామాజికవర్గానికి చెందిన ప్రజానీకం అత్యంత పేదరికంలో మగ్గుతూ జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ముదిరాజ్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ సొసైటీ ద్వారా ప్రణాళికబద్ధంగా నిధులను విడుదల చేస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈటల భద్రన్న, జోరుక జగన్‌, పిట్ల నగేష్‌, బొజ్జ అనిల్‌ కుమార్‌, సురేష్‌, జనార్దన్‌, సాయిరాం, రాజేశ్వర్‌, బొర్రన్న శ్రీకాంత్‌, గోపి తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

చైతన్యపురి: శ్రావణమాసంలో జరిగే శుభకార్యాలు, పెళ్లిళ్లకు తక్కువ ధరకే అద్దె బస్సులు ఇవ్వనున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌ సిటీడిపో మేనేజర్‌ సమంత తెలిపారు. ప్రైవేటు వాహనాల కన్నా ఆర్టీసీ బస్సు ఛార్జీలలో రాయితీ ఎక్కువగా ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7382802705 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డిపో సందర్శన

నాగోలు: బండ్లగూడ ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉద్యోగులందరూ కృషి చేయాలని గ్రేటర్‌ హైదరాబాద్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన డిపోను సందర్శించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు షాలీని, బాల యోగేశ్వరి, డిప్యూటీ ఆర్‌ఎం జగన్‌, డిప్యూటీ టీఎం శ్రీనివాస్‌, డిపో మేనేజర్‌ టి. వెంకటేశం పాల్గొన్నారు.





ఆలయాలకు శ్రావణ శోభ

- ప్రారంభమైన శ్రావణమాస తొలి శుక్రవారం పూజలు
- కిక్కిరిసిన అమ్మవారి ఆలయాలు
- ఆర్‌కేపురం అష్టలక్ష్మి అమ్మవారి దర్శనానికి బారులు

దిల్‌సుఖ్‌నగర్‌: శ్రావణమాసం ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రావణమాసం మొదటి రోజే శుక్రవారం రావడంతో భక్తులు ఆనంద పరవశులయ్యారు. అమ్మవారి ఆలయాలకు పోటెత్తి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మలక్‌పేటజోన్‌ పరిధిలోని ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆర్‌కేపురం డివిజన్‌ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయం, శ్రీదుర్గాదేవి దేవాలయ, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్‌ నిలయం, అక్బర్‌బాగ్‌లోని హరిహరక్షేత్రం, సైదాబాద్‌లోని శ్రీజయదుర్గా, శ్రీవిజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, మాదన్నపేట్‌లోని దుర్గాదేవి ఆలయం, ఐఎస్‌సదన్‌ తదితర ప్రాంతాలలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఆర్‌కేపురం డివిజన్‌ పరిధిలో కొలువైన అష్టలక్ష్మీ ఆలయంలో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆదిలక్ష్మీ అమ్మవారికి స్వర్ణ వస్త్రాధారణ, స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్‌, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


వాసవి కాలనీలోని అష్టలక్ష్మి అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.25, వంకాయ రూ.35, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.50, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్‌ రూ.23, క్యాబేజీ రూ.23, క్యారెట్‌ రూ.28, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.37, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.15, సొరకాయ రూ13, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.65, అర్వి రూ.40, మునగ రూ.35, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్‌ రూ.23, కీర రూ.25, బీన్స్‌ రూ.40, క్యాప్సికమ్‌ రూ.47. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

మన్సూరాబాద్‌: సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన రాములమ్మ కుటుంబ సభ్యులతో కలిసి మన్సూరాబాద్‌ డివిజన్‌ కాస్మోపాలిటన్‌ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌ వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుని సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఆమెకు మంజూరైన రూ. 27,500 చెక్కులను శుక్రవారం బీఆర్‌ఎస్‌ నాయకుడు పోచబోయిన జగదీష్‌యాదవ్‌ అందజేశారు. సుధాకర్‌రెడ్డి, చంద్రమోహన్‌, వెంకన్న పాల్గొన్నారు.

పరామర్శ

చైతన్యపురి: ఇటీవల మృతి చెందిన బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకుడు పసుపుల హరిబాబు కుటుంబానికి అండగా ఉంటాని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌ అన్నారు. శుక్రవారం చైతన్యపురిలోని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి హరిబాబు చిత్రపటానికి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో కాంచన కృష్ణ, పురుషోత్తం, మహేష్‌, నీరంకి రవి పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

హయత్‌నగర్‌: జనగామ పోలీసులు న్యాయవాద దంపతులపై దాడి చేశారని ఆరోపిస్తూ శుక్రవారం హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్‌ మేజిస్ట్రేట్‌ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్‌ అసోషియేషన్‌ అధ్యక్షులు బొడ్డు భిక్షపతిగౌడ్‌ ఆధ్వర్యంలో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చట్టం, న్యాయం తెలిసిన న్యాయవాదుల పట్ల పోలీసులు దాడులకు పాల్పడటం తగదన్నారు. దాడికి పాల్పడిన పోలీసు అధికారులు, సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. నిరసనలో సంతోష్‌కుమార్‌గౌడ్‌, మోడెం ప్రభాకర్‌గౌడ్‌ బండి, నరేష్‌, సంతోష్‌, ఈశ్వర్‌గౌడ్‌ సరిత, శివకుమార్‌ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్‌ ఘర్‌ తిరంగా ర్యాలీ


జెండాకు వందనం చేస్తున్న నాయకులు

ఎల్‌బీనగర్‌: హర్‌ ఘర్‌ తిరంగా అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీఎన్‌రెడ్డి నగర్‌ చౌరస్తా నుంచి వనస్థలిపురం కాంప్లెక్స్‌ వరకు 75 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్‌ అధ్యక్షులు సామ రంగారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. జాతీ ఐక్యత, సమగ్రత పట్ల నిబద్ధతో గత కొన్ని సంవత్సరాలుగా హర్‌ ఘర్‌ తిరంగా అభియాన్‌ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహా, నాయికోటి పవన్‌కుమార్‌, బద్దం ప్రేమ్‌ మహేశ్వర్‌రెడ్డి, చింతల అరుణ సురేందర్‌యాదవ్‌, నాయకులు వనపల్లి శ్రీనివాస్‌ రెడ్డి, క్షేత్రం రవీందర్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్‌, కొంతం నవ కిషోర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో..

చైతన్యపురి: హర్‌ ఘర్‌ తిరంగాలో భాగంగా దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంపై ట్రస్ట్‌ చైర్మన్‌ బీవీ శ్యామ్‌కుమార్‌ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ మాజీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, గౌరవ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాధునిక వినికిడి పరికరాల అందజేత

చాదర్‌ఘాట్‌: సమాజంలో అందరికి సమాన అవకాశాలు రావడం కష్టమని, కానీ ఆ దిశగా ప్రయత్నాలు చేయడం, అవకాశాలు కల్పించడం ముదావహమని జైన్‌ విద్యా సంస్థల సీఈఓ డాక్టర్‌ చంద్రశేఖర్‌ అన్నారు. మలక్‌పేటలోని ప్రభుత్వ బధిరుల పాఠశాలకు చెందిన ఐదుగురు పిల్లలకు వుయ్‌ హియర్‌ ఇన్నోవేషన్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో అత్యాధునిక వినికిడి పరికరాలను అందించారు. ముంజేతికి తగిలించుకునే రిస్ట్‌ బ్యాండ్‌, తలమీదుగా చెవులకు తగిలించుకునే హెడ్‌బ్యాండ్‌ అనే రెండు భాగాలుగా ఈ పరికరం ఉంటుంది. వాటిలో రిస్ట్‌ బ్యాండ్‌కు ఉండే మైక్రోఫోన్‌ అన్ని రకాల శబ్దాలను విని, బ్లూటూత్‌ ద్వారా హెడ్‌బ్యాండ్‌కు పంపుతుందని సంస్థ డైరెక్టర్‌ విజయ్‌షా, ఆదేశ్‌ అగర్వాల్‌ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.


వినికిడి పరికరాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

సాయిబాబా ఆలయంలో దివ్యాంగ జంటకు వివాహం


నూతన జంటను ఆశీర్వదిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చైతన్యపురి: శాంతి దివ్యాంగుల సంఘం గౌలిపురం అధ్యక్షుడు శ్రీగిరి రజని అభ్యర్థన మేరకు దివ్యాంగ జంటకు శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో వివాహం జరిపించారు. సంస్థాన్‌ ట్రస్ట్‌ మాజీ చైర్మన్‌ మల్లయ్య దంపతుల సొంత ఖర్చుతో నూతన వధూవరులు రాముడు, మంజులకు పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు అందజేశారు. సంస్థాన్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ బీవీ. శ్యామ్‌కుమార్‌, కోశాధికారి వి.నర్సింహరావు, జాయింట్‌ సెక్రటరి కోడి రాజశేఖర్‌, కార్యవర్గ సభ్యుడు యం .శ్యామలరావు పాల్గొన్నారు.

దేవాలయ ఆర్చికి విద్యుత్‌ దీపాలంకరణ

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురంలో కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయ ఆర్చికు దీపాలంకరణను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. 15 ఏళ్ల క్రితం నిర్మించిన కుర్తాల పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయ ఆర్చితో ఆర్‌కేపురం కాలనీకి గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకుడు ఉపేందర్‌ రెడ్డి, కాలనీ ప్రతినిధులు రామారావు, వెంకటేశ్వర్లు, ఏకే రెడ్డి, శ్రీశైలం, సంతోష్‌, విట్టల్‌ శర్మ, విప్లవ, అరుణ, హేమ పాల్గొన్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్‌ ఆవిర్భావ వేడుకలు

మన్సూరాబాద్‌ యువజన కాంగ్రెస్‌ 64వ ఆవిర్భావ వేడుకలు ఎల్‌బీనగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్‌ రింగ్‌రోడ్డులోని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, మొక్కలు నాటారు. అనీల్‌, జావెద్‌, ఇర్ఫాన్‌, మనోజ్‌, రాజశేఖర్‌, గుణవర్ధన్‌, రాము పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్‌ స్టాల్‌కు విశేష స్పందన


స్టాల్‌ను సందర్శించిన డాక్టర్‌ మీర్జా అలీబేగ్‌

సైదాబాద్‌: తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జువైనల్‌ బాలల హ్యాండ్లూమ్‌ స్టాల్‌కు విశేష స్పందన లభించిందని జువైనల్‌ వెల్ఫేర్‌ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ డాక్టర్‌ మీర్జా అలీబేగ్‌ తెలిపారు. తెలంగాణ స్టేట్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ, తెలంగాణ జువైనల్‌ వెల్ఫేర్‌ అండ్‌ కరక్షనల్‌ సర్వీసెస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిప్యూటీ డైరెక్టర్‌ సందర్శించి మాట్లాడారు. బాలల స్టాల్‌కు మంచి స్పందన లభించిందని, ఒక్కరోజులోనే రూ.1.20లక్షల అమ్మకాలు జరిగినట్లు తెలిపారు.

నేడు, రేపు ఉచిత వైద్య శిబిరం

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురంలో ఇన్‌కమ్‌ టాక్స్‌ కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో కేర్‌ హాస్పిటల్‌ సౌజన్యంతో ఈ నెల 10, 11 తేదీలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ సొసైటీ ప్రతినిధులు రమేష్‌ బాబు, రాజేశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ


ఆలయ కమిటీ సభ్యులతో హీరో ఆకాష్‌ జగన్నాథ్‌

చంపాపేట: చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ క్రాంతిక్లబ్‌ ఆవరణలోని పోచమ్మ అమ్మవారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ శుక్రవారం నాలుగో రోజు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హీరో ఆకాష్‌ జగన్నాథ్‌ హాజరై ఎల్‌బీనగర్‌ బీఆర్‌ఎస్‌ పార్టీ యూత్‌ అధ్యక్షుడు రవి ముదిరాజ్‌తో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథ్‌గౌడ్‌, సభ్యులు మల్లేష్‌గౌడ్‌, విఠల్‌రెడ్డి, రాఘువేందర్‌, శివగౌడ్‌, జగదీష్‌గౌడ్‌, చందు, నాయకులు సదానంద్‌రెడ్డి, ముడుపు రాజిరెడ్డి, ఉమామహేశ్వర్‌ పాల్గొన్నారు.

ఇద్దరు చైన్‌ స్నాచర్ల అరెస్ట్‌

మలక్‌పేట: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్‌ చేసిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. హైదరాబాద్‌ సిటీ టాస్క్‌ఫోర్స్‌ డిప్యూటీ కమిషనర్‌ వైవీఎస్‌ సుధీంద్ర వివరాల ప్రకారం.. కుర్మగూడ, మాదన్నపేటకు చెందిన మహమూద్‌ షరీఫ్‌ అలియాస్‌ ఛోటూ(29), బైక్‌ మెకానిక్‌. సంతోష్‌ నగర్‌ రియాసత్‌ నగర్‌ చెందిన అబ్దుల్‌ గఫార్‌ అలియాస్‌ ఆరీఫ్‌ చౌస్‌(37)క్యాబ్‌ డ్రైవర్‌. ఇద్దరు కలిసి చైన్‌ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇద్దరు కలిసి నగరంలోని వివిధ పోలీస్‌ స్టేషన్ల పరిధిలో చైన్‌ స్నాచింగ్‌లు, సెల్‌ఫోన్ల చోరీలు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకున్న పోలీసులు సౌత్‌ఈస్ట్‌ టాస్క్‌ఫోర్స్‌ బృందం, మలక్‌పేట పోలీసులతో కలిసి గురువారం వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 51.50 గ్రాములు బంగారం, ఐ–20 హుందాయ్‌ కారు, పల్సర్‌ బైక్‌ ఐఫోన్‌ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ మొత్తం రూ.11 లక్షలు ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి


నాగదేవతకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మలక్‌పేట: సలీంనగర్‌ శ్రీపురంకాలనీ నల్లపోచమ్మ దేవాలయం వద్ద శుక్రవారం శ్రావణ మాసం నాగుల పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టవద్ద దీపాలు వెలిగించి, పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు.

మన్సూరాబాద్‌లో..

మన్సూరాబాద్‌: నాగుల పంచమి వేడుకలను మన్సూరాబాద్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్‌ పోచమ్మ దేవాలయంలో నాగదేవతకు భక్తులు తెల్లవారుజాము నుంచే పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు.


పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్‌ అరుణరవీందర్‌రెడ్డి

ఓల్డ్‌మలక్‌పేటలో..

చాదర్‌ఘాట్‌: ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ దేవాలయంలో నాగ పంచమి సందర్భంగా మహిళలు పుట్టలో పాలుపోసి మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో నాగదేవతను సందర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌ ముదిరాజ్‌, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చాకి రవికుమార్‌, తులసి సురేష్‌, నరేందర్‌ ముదిరాజ్‌, టిన్నూసింగ్‌ పాల్గొన్నారు.


పుట్టలో పాలుపోస్తున్న మహిళలు

ఐఎస్‌సదన్‌, సైదాబాద్‌ డివిజన్ల పరిధిల్లో..

సైదాబాద్‌: ఐఎస్‌సదన్‌, సైదాబాద్‌ డివిజన్ల పరిధిలో నాగ పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సైదాబాద్‌ డివిజన్‌ రెడ్డిబస్తీలోని నాగులమ్మ దేవాలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డిని ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు.

ముగిసిన స్వచ్ఛదనం-పచ్చదనం


బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి, డీసీ తిప్పర్తి యాదయ్య


కాలనీవాసులతో కలిసి ఈస్ట్‌ప్రశాంత్‌నగర్‌లో మొక్క నాటుతున్న కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మి


సరస్వతీనగర్‌ కాలనీలో మొక్కలు నాటిన కార్పొరేటర్‌ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చివరి రోజు శుక్రవారం ఎల్‌బీనగర్‌, మలక్‌పేట నియోజకవర్గాల్లో భారీగా మొక్కలు నాటారు. ఆయా డివిజన్లలో కార్పొరేటర్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. పలు ప్రాంతాల్లోని చెత్త, వ్యర్థాలను తొలగింపజేశారు. –ఎల్‌బీనగర్‌, మలక్‌పేట జోన్ల బృందం


విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, డీసీ జకీయా సుల్తానా


హస్తినాపురం భీమానగర్‌ కాలనీలో మొక్క నాటుతున్న కార్పొరేటర్‌ సుజాతా నాయక్‌


పరమేశ్వర కాలనీలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్‌ జీవన్‌రెడ్డి